క్లుప్తంగా

భువనేశ్వరి బస్సు యాత్ర హాస్యాస్పదం

• జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: స్కిల్ స్కామ్‌లో దొరికిపోయిన చంద్రబాబుకు మద్దతుగా నారా భువనేశ్వరి బస్సు యాత్ర చేయడం హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి ఆక్షేపించారు. భువనేశ్వరి యాత్రను నిజం సమాధి చేసే యాత్రగా ఆమె అభివర్ణిస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడంతో ప్రజలు వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉన్నారన్నారు.

చార్టెడ్ అకౌంటెన్సీపై అవగాహన అవసరం



ఫైనాన్స్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్న ప్రసాదరావు

కరప: మంచి వేతనంతో కూడిన ఉపాధి పొందాలంటే ఫైనాన్స్ రంగానికి చెందిన చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) మంచిదని కెరీర్ గైడెన్స్ ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు తెలిపారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. 10వ తరగతి పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు తమకిష్టమైన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అందుకు ఏయే రంగాలలో ఏయే ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందో ఆయన వివరించారు. ఫైనాన్స్ రంగంలో ఏయే చదువులు ఎలా చదవాలో వీడియో క్లిప్పింగ్‌ల ద్వారా అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ పాల్గొన్నారు.

ఢిల్లీకి మట్టి కలశం



నడకుదురు నుంచి మట్టి కలశంతో ఢిల్లీకి వెళుతున్న వీరప్రసాద్ గాంధీ

కరప: మండల పరిధిలో వివిధ గ్రామాల్లో సేకరించిన మట్టి కలశంతో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్టా వీరప్రసాద్‌గాంధీ శుక్రవారం బయలుదేరి వెళ్లారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా మట్టి–నా దేశం కార్యక్రమం ద్వారా బీజేపీ నాయకులు మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు వీరప్రసాద్ గాంధీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో రాజధాని ఢిల్లీలో దేశవ్యాప్తంగా సేకరించిన మట్టితో అమృతవాటిక నిర్మిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం నడకుదురులో మండలంలో సేకరించిన మట్టిని కలశంలో ఉంచి ర్యాలీ నిర్వహించారు. విజయవాడ నుంచి బయలుదేరే ప్రత్యేక రైలు నుంచి ఢిల్లీకి మట్టి కలశం తీసుకెళ్లే అవకాశం తనకు లభించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వరరావు, పార్టీ నాయకులు చోడిశెట్టి రమేష్, రెడ్డి లోవ ప్రసాద్, ఎం.కరుణ, జి.జీవ, పి.ఫణి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు లేబర్ టేబుళ్ల వితరణ



లేబర్ టేబుళ్లను బహూకరించిన కాశీ విశ్వనాథ్, చిత్రంలో రోటరీ బృందం

కాకినాడ : కాకినాడ జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగానికి కాకినాడ రోటరీ క్లబ్ బృందం నాలుగు లేబర్ టేబుళ్లను ఉచితంగా అందజేసింది. ఈ టేబుళ్లను ప్రసూతి విభాగంలో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి సమక్షంలో అందజేశారు. పేద రోగులకు విశేష సేవలందిస్తున్న ప్రసూతి విభాగ నిపుణులకు రోటరీ బృంద ప్రతినిధులు అభినందనలు తెలిపారు. క్లబ్ ప్రెసిడెంట్ కాశీవిశ్వనాథ్, కార్యదర్శి ఎస్‌వీ రావు, ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ ఆదిత్య సత్య ప్రసన్న, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించకుండా రహదారి!

బోట్‌క్లబ్: స్థానిక 6వ డివిజన్‌లో కలరాపాకల వీధిలో రోడ్డు పనులు సక్రమంగా చేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీజేపీ నాయకులు స్థానిక 6వ డివిజన్‌లో రోడ్డు పనులు పరిశీలించారు. రూ.88 లక్షలతో రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారని కానీ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉన్న దాన్ని నిర్మించడం లేదని వాపోయారు. ఈ ప్రాంతంలో ఏదైనా ప్రమాదం సంభవించినా అంబులెన్స్‌లు కానీ, అగ్నిమాపక యంత్రాలుకానీ వీధిలోని రావడానికి వీలు లేకుండా ఉందన్నారు.

రైస్ మిల్లర్లకు రూ.49.56 కోట్ల జమ

• జేసీ ఇలక్కియ



జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: జిల్లాలోని రైస్ మిల్లర్లకు గత సీజన్లకు సంబంధించి రూ.49.56 కోట్లు జమ చేయనున్నట్టు జేసీ ఎస్.ఇలక్కియ తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు అన్నీ పూర్తిస్థాయిలో సీఎంఆర్‌లో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మెషినరీ, హమాలీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఎంఆర్‌లో పాల్గొనే రైస్ మిల్లర్లు అందరూ వారి మిల్లుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటిని కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని జేసీ అన్నారు. ధాన్యం సేకరణకు అవసరమయ్యే గోనె సంచులను నిర్దేశించిన గోదాముల్లో ముందుగానే జమ చేయాలని, నిర్దేశించిన బ్యాంకు గ్యారంటీలను నిర్ణీత గడువుతో అందజేయాలని, అగ్రిమెంట్లు ఇవ్వాలన్నారు. మిల్లులకు మాత్రమే సీఎంఆర్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఆమె తెలిపారు. రబీ 2022–23 సీజన్‌కి సంబంధించి సీఎంఆర్ రైస్ ఈ నెలాఖరులోగా పంపిణీ చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సీసీ కెమెరాలు, గోనె సంచులు, బ్యాంకు గ్యారంటీలను ప్రభుత్వ ఆదేశాల ఏర్పాటు చేయాలని మిల్లర్లను కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ డి.పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ట్రాక్టర్లకు ఇక జీపీఎస్

• తీసుకోవలసిన చర్యలపై ఎంపీఓ సమీక్ష



ట్రాక్టర్లకు జీపీఎస్ చేసే చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీఓ రాజేష్

కరప: మండల పరిధిలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా గ్రామాల్లో ట్రాక్టర్లను గుర్తించి, జీపీఎస్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీఓ ఏవీ రాజేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం వీపీఏలు, వీఆర్వోలు, ఆర్‌బీకేల సిబ్బందితో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన వివిధ అంశాలపై చర్చించి, పలు సూచనలిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 114 ట్రాక్టర్లను గుర్తించినట్టు తెలిపారు. ఈ నెల 30న వాకాడలో, 31న కరప, పెనుగుదురులలో ట్రాక్టర్ల ఇంజన్లకు జీపీఎస్ చేయనున్నట్టు తెలిపారు. ఇంకా అదనంగా ట్రాక్టర్లు గానీ, వ్యాన్లు కానీ, లారీలు కానీ ఉంటే గుర్తించి, ధాన్యం రవాణా గురించి వివరించి జీపీఎస్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు జీపీఎస్ చేసిన వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్టు తెలిపారు. గతేడాది కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో ఎదురైన ప్రతిబంధకాలను గుర్తించి, ఈ ఏడాది ఆర్‌బీకేల వద్ద ట్రాక్టర్లను అందుబాటులో ఉంచనున్నట్టు ఎంపీఓ రాజేష్ వివరించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఏఎస్ఓ ఆర్.లావణ్య, డీటీ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించండి



నార్కో సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

• కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంతరం కలెక్టరేట్‌లో నార్కో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఏఎస్పీ పి.శ్రీనివాస్ సబ్ అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ తదితరులతో పాటు రెవెన్యూ, పోలీస్ తదితర అధికారులు హాజరయ్యారు. తొలుత సెబ్ ఏఎస్పీ ప్రేమ్ కాజల్ జిల్లాలో నమోదు చేసిన గంజాయి కేసులు, అక్రమ రవాణా తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా నోడల్ అధికారులను, కమిటీలను నియమించాలని ఆదేశించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా కాకినాడను మార్చేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. సమావేశంలో జీఎస్‌టీయూ రిజిస్ట్రార్ ఎల్.సుమలత, కాకినాడ, పెద్దాపురం, డీఎస్పీలు పాల్గొన్నారు.

పోలీసులు మీ స్నేహితులే

• ఎస్సై రామకృష్ణ
• విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన



విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో కార్యకలాపాలు వివరిస్తున్న అధికారులు

కరప: సమాజంలో శాంతి, భద్రతలు కాపాడడంలో పోలీసులే కీలకపాత్ర పోషిస్తారని, విద్యార్థులు పోలీసుస్టేషన్, సిబ్బంది పనితీరుపై అవగాహన కల్పించుకోవాలని ఎస్ఐ ఎస్.రామకృష్ణ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఓపెన్ హౌస్‌లో ఆయన మాట్లాడారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తున్నా, అపరిచితులు తారసపడినా, ఏ ఆపదలో ఉన్నా ముందుగా పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేస్తే తగిన రక్షణ కల్పిస్తారన్నారు. పోలీసులంటే భయాలు వద్దని, ఫ్రెండ్లీగా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసుస్టేషన్ అంతా చూపిస్తూ ఫిర్యాదులు ఎలా చేయాలి, వైర్‌లెస్ సెట్ ఎలా పనిచేస్తుందీ, పోలీసులు వినియోగించే ఆయుధాలు, నిందితులను ఉంచే సెల్, రైటర్ రూమ్, చూపించి పనిచేసే విధానాలు వివరించారు. ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్, వీవీ శ్రీనివాస్, జీజే సురేష్‌కుమార్, కేయూ లింగారెడ్డి, వి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్ విజయరావు

కాకినాడ రూరల్: అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏపీఎస్పీ 3వ బెటాలియన్ క్యాంపు యూనిట్ ఆస్పత్రి వద్ద సిబ్బందికి మెగా వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలందించారు. శిబిరాన్ని బెటాలియన్ కమాండెంట్ విజయరావు ప్రారంభించారు. స్వయంగా ఆయన వైద్య, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. శిబిరంలో మెడికవర్, అపోలో ఆస్పత్రి, విజన్ ఆస్పత్రి, శ్రీకిరణ్ ఆస్పత్రి వైద్యులు సేవలందించగా మొత్తం 325 మంది వైద్యం పొందారు. వీరిలో సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో పాటు ఆదర్శ ఆశ్రమం, ఉమా మనోవికాస కేంద్రం, ఆశ్రమ శ్రావణ ఆశ్రమం నుంచి 57 మంది వైద్యం పొందారు.

ఎల్‌ఐసీ ఏజెంట్లకు అండగా ఉంటాం



ఎంపీ వంగా గీత, విశ్వనాథ్‌లను గజమాలతో సత్కరిస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

• ఎంపీ వంగా గీత

కాకినాడ: ఎల్‌ఐసీ ఏజెంట్లకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీ వంగా గీత హామీ ఇచ్చారు. లైఫ్ ఇన్స్యూ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ కౌన్సిల్ సమావేశం స్థానిక వెంకీ రెసిడెన్సీలో శుక్రవారం జరిగింది. సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఏజెంట్లు ఇటీవల తమ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను పార్లమెంట్‌లో చర్చించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానన్నారు. వీటిలో కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, మిగిలిన అంశాలు కూడా త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎంపీని ఎల్‌ఐసీ ఏజెంట్లు ఘనంగా సత్కరించారు. రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు రావుల మాధవరావు, పలువురు ఎల్‌ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో తప్పిన ప్రమాదం



నడక దారిలో పడ్డ భారీ పెచ్చులు

కాకినాడ: జీజీహెచ్‌లో శుక్రవారం సిబ్బంది, రోగులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎంఆర్‌డీ (మెడికల్ రికార్డ్స్ విభాగం) వద్ద ఉన్న దస్త్రాలు భద్రపరిచే కార్యాలయాల ఎదురుగా ఉన్న సీలింగ్ పైకప్పు పెచ్చులూడి కింద పడింది. ఈ ప్రమాదం నుంచి పలువురు దరఖాస్తుదారులు, రోగులు, సిబ్బంది త్రుటిలో తప్పించుకున్నారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ఘటనా స్థలాన్ని సందర్శించి సిబ్బంది, దరఖాస్తుదారుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ జిల్లా అధికారులు సందర్శించి పరిశీలించారు. భవనంలోని ఆ భాగం శిథిలావస్థకు చేరిందని నిర్ధారించారు. తక్షణ మరమ్మతులు అవసరమని సిఫార్సు చేశారు. ఆ దిశగా కలెక్టర్‌ను అనుమతులు కోరి మరమ్మతులు చేపడతామని సూపరింటెండెంట్ అన్నారు.

కాకినాడ-1 ట్రాఫిక్ సీఐగా రమేష్



కాకినాడ: కాకినాడ-1 ట్రాఫిక్ సీఐగా నూని రమేష్ బాధ్యతలు స్వీకరించారు. 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన తొలి పోస్టింగ్ విజయవాడ సిటీలో మోటార్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌గా పొందారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. 23 ఏళ్ల ప్రస్థానంలో 168 అవార్డులు సాధించారు. వీటిలో ప్రధాన మంత్రి పతకంతో పాటు సేవా పతకం ఉండటం గమనార్హం. శుక్రవారం బాధ్యతల చేపట్టిన ఆయనకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ విజేతకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ సిటీ: జిల్లా ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న మందపల్లి శ్రీనివాసరావు నేపాల్, దుబాయ్‌లలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ సత్కరించారు. ఈ పోటీల్లో శ్రీనివాసరావు లాస్ ఆఫ్ పే మీద వెళ్లి పోటీల్లో పాల్గొంటున్నారని ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు, దళిత గిరిజన బీసీ ముస్లిం క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షులు డోకుబుర్ర భద్రం కలెక్టర్ కృతికా శుక్లా దృష్టికి తీసుకువచ్చారు. ఇతనిని డ్రైవర్ ఉద్యోగం నుంచి కార్యాలయానికి మార్చాలని కోరారు. నగరంలో ఇంటి స్థలం మంజూరు చేయాలని పోటీలకు వెళ్లే సమయంలో ఆర్థికంగా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారులు, మోనిటరింగ్ కమిటీ సభ్యులు బండి వీరలింగేశ్వరరావు, త్రినాథ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఆదిత్య విద్యార్థిని ఎంపిక



ఢిల్లీ పరేడ్‌కు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ఏడీ డాక్టర్ నాయుడు, తేజేశ్వరరావు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ దాసరి నిస్సి ప్రియాంక ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్టు కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు శుక్రవారం తెలిపారు. నన్నయ వర్సిటీలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాల్గొని నారీశక్తి నినాదంతో 2024లో ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ పరేడ్‌కు అర్హత సాధించారన్నారు. 2018 నుంచి తమ కళాశాల నుంచి వరుసగా ఆరోసారి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వ వికాస నిర్మాణం అనే ఉద్దేశంతో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్‌లో ఉత్సాహంగా పాల్గొనడం వల్ల విజయాలు సాధ్యమౌతున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నిస్సి ప్రియాంకను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, పీవో తేజేశ్వరరావు అభినందించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటనపై బీఎల్ఓలతో మాట్లాడుతున్న ఈఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: నియోజకవర్గ ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించినట్టు ఈఆర్వో, ఆర్డీఓ ఇ.కిశోర్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బూత్ స్థాయి అధికారులతో శనివారం సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలకు 2,55,711 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1,27,044 మంది మహిళలు, 1,28,648 మంది పురుషులు, 19 మంది ఇతరులు ఉన్నారన్నారు. నవంబరు 4, 5 తేదీలలో నిర్వహించే ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా, 2024 నాటికి 18 ఏళ్లు నిండుతున్న యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులకు డిసెంబరు 9 వరకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో కాకినాడ రూరల్, కరప తహసీల్దార్లు మురార్జీ, శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సారథి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



స్పెషల్ క్యాంపెయిన్ డే పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

ఓటర్ల జాబితా సవరణకు స్పెషల్ కాంపెయిన్

కరప: ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని, ఆ జాబితాలో తప్పొప్పులుంటే ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం బీఎల్ఓలు, వీఆర్వోలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శని, ఆదివారాలతో పాటు, నవంబరు, డిశంబర్ నెలల్లో శని, ఆదివారాల్లో పోలింగ్‌స్టేషన్ల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఓటర్ల నుంచి ఏమైనా అభ్యంతరాలున్నా, సవరణలున్నా, సంబంధిత ఫార్మేట్లలో దరఖాస్తులు స్వీకరించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. స్పెషల్ కాంపెయిన్ డే గురించి ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకుని, మండలంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత

బోట్‌క్లబ్: రాహుగ్రస్త చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాలు మూసివేయనున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం సాయంత్రం ఐదు గంటలు వరకూ ఆలయాలు మూతపడనున్నాయి. సంప్రోక్షణ అనంతరం ఆలయాలు తెరవనున్నట్లు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఇప్పటికే ఆలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం వల్ల మూసివేయనున్నట్లు ఈవో చింతపల్లి విజయ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయం తెరవనున్నట్టు ఆయన తెలిపారు. వీటితో పాటు స్థానిక దేవాలయం వీధిలోని బాలా త్రిపురసుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయం, వేణుగోపాలస్వామి దేవస్థానం, మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానం, భానుగుడి భానులింగేశ్వరస్వామి దేవస్థానం, గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంతో పాటు నగరంలో పలు ఆలయాలు చంద్రగ్రహణం వల్ల శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకూ మూతపడనున్నాయి.

భావనారాయణ స్వామి ఆలయం..

కాకినాడ రూరల్: చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి సర్పవరంలోని భావనారాయణ స్వామి ఆలయం మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ జొన్నాడ భీమశంకర రావు తెలియజేశారు. భక్తులు గమనించాలని దర్శనాలు రద్దు చేశామన్నారు. గ్రహణ శుద్ధి అనంతరం ఆదివారం ఉదయం 5 గంటల నుంచి దర్శనాలకు అనుమతిస్తామన్నారు.

కుటుంబ సమేతంగా చూసే సినిమా

• నరకాసుర చిత్ర దర్శకుడు సబాస్టియన్



విలేకర్లతో మాట్లాడుతున్న నరకాసుర చిత్ర దర్శకుడు సబాస్టియన్, హీరో, హీరోయిన్లు

బోట్‌క్లబ్: కుటుంబం అంతా వచ్చి చూసేలా తమ చిత్రం ఉంటుందని నరకాసుర చిత్ర దర్శకుడు సబాస్టియన్ అన్నారు. శుక్రవారం రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో నరకాసుర చిత్రబృందం విలేకర్ల సమావేశంలో మాట్లాడింది. కాకినాడ ప్రజలు కళాకారులను ఎంతగానో ఆదరిస్తారన్నారు. నరకాసుర చిత్రం నవంబర్ మూడో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 325 థియేటర్లలో విడుదలవుతోందన్నారు. చిత్ర హీరో అల్లూరి రక్షిత్ మాట్లాడుతూ ఈ సినిమా కొత్త కథతో తీశామన్నారు. ఈ చిత్రం యాక్షన్, ప్రేమ, కామెడీతో కలిసి ఉంటుందన్నారు. కాకినాడ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. తాను నటించిన పలాసా చిత్రాన్ని మీరందరూ విజయవంతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రం హీరోయిన్లు అపర్ణ, సంకీర్తన పాల్గొన్నారు.

అమ్మవార్లకు స్వర్ణ నేత్రాలు, వెండి కిరీటం సమర్పణ



భక్తుడు పాపారావు దంపతులు సమర్పించిన బంగారు నేత్రాలతో గోదా అమ్మవారు



నీలాదేవి అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పిస్తున్న ఫణి, కామేశ్వరి దంపతులు

కాకినాడ రూరల్: జిల్లాలో పురాతన ప్రసిద్ధి గాంచిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో అమ్మవార్లకు భక్తులు బంగారు నేత్రాలు, వెండి కిరీటాన్ని శుక్రవారం సమర్పించారు. గోదాదేవి అమ్మవారికి 9 గ్రాముల బంగారు నేత్రాలను భక్తుడు పాపారావు దంపతులు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అలాగే భావనారాయణ స్వామి ప్రధానాలయంలో కొలువై ఉన్న నీలాదేవి అమ్మవారికి సర్పవరం గ్రామానికి చెందిన ఫణి, కామేశ్వరి దంపతులు వెండి కిరీటం సమర్పించారు. ఆలయ అర్చకులు, అధికారులు, ఆలయ కమిటీ సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమేశ్వరరావు అభినందనలు తెలిపారు.

వచ్చే నెలలో చెకుముకి సంబరాలు

పిఠాపురం: వచ్చే నెల పదో తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక చెకుముకి కన్వీనర్ ఎస్.గంగరాజు తెలిపారు. శుక్రవారం ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓ నారాయణదాసు చేతుల మీదుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్సు సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను 33 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. నవంబర్ 10వ తేదీన పాఠశాల స్థాయిలోను, 30న మండల స్థాయిలోను, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలోను, 2024 జనవరి27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరుగుతాయన్నారు. 1 నుంచి పదో తరగతి చదువుకునే విద్యార్థులు అందరూ పాల్గొనవచ్చని, ప్రవేశ రుసుము రూ.10 మాత్రమే అని ఆయన తెలిపారు. జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు వి.సత్యనారాయణ రెడ్డి, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.సూర్యనారాయణ రాజు, మున్సిపల్ గరల్స్ హైస్కూలు హెచ్‌ఎం మూర్తి, విరవ హైస్కూలు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.